బాలలం, భారత దేశ పౌరులం

మన రాజ్యాంగ పీఠిక



లీలా సేథ్

బిందియా థాపర్

Original Story in English **'We, the Children of India
The Preamble to our Constitution'** by Leila Seth
© Leila Seth, 2010

Illustrations: Bindia Thapar
© Bindia Thapar, 2010

Photographs on pages 6, 7, 13, 29, 30, 32-35 courtesy the Nehru Memorial Museum and Library, New Delhi
Photographs on pages 9, 12 courtesy the India International Centre Library, New Delhi

First Published in English by Puffin, Penguin Books India 2010

'Balalam Bharatha Desha Powrulam - Mana Raajyaanga Peethika'
Telugu Translation by Usha Turaga Revelli
© Pratham Books, 2013

First Telugu Edition: 2013

ISBN: 978-81-8479-438-0

Typesetting and layout: Pratham Books, Bangalore

Printed by: Rave India, New Delhi

Published by: Pratham Books | **www.prathambooks.org**

Registered office:
PRATHAM BOOKS
621, 2nd Floor, 5th Main, OMBR Layout
Banaswadi, Bangalore 560 043
T: +91 80 42052574 / 41159009

Regional Office: New Delhi | T: +91 11 41042483

The development of this book has been supported by

parag
Promoting innovative publishing in education
A SIR RATAN TATA TRUST INITIATIVE

All rights reserved.
No part of this publication may be reproduced or distributed in any form or by any means, or stored in a database or retrieval system, without the prior written permission of the publisher.

PRATHAM BOOKS

బాలలం,
భారత దేశ పౌరులం

మన రాజ్యాంగ పీఠిక

రచన

లీలా సేథ్

చిత్ర రచన

బిందియా థాపర్

తెలుగు అనువాదం

ఉషా తురగా రేవెల్లి

ప్రియమైన పిల్లల్లారా,

భారత రాజ్యాంగానికి ఉపోద్ఘాత పత్రం గురించిన ఈ పుస్తకాన్ని నేను మీ కోసం రాశాను. నా ఐదు సంవత్సరాల మనవరాల అనామిక, ఎనిమిది సంవత్సరాల మనవరాలు నందిని సహాయంతో నేను ఈ పుస్తకం రాశాను. మంచి పౌరుడు, పౌరురాలు కావడం చాలా ముఖ్యమని మనం అనుకుంటాం. (ఒక దేశానికి చెందిన వ్యక్తిని పౌరుడు లేదా పౌరురాలు అంటారు.) అంటే, మన రాజ్యాంగంలో చెప్పిన లక్ష్యాలను అనుసరించాలి అన్నమాట. ఈ లక్ష్యాలు ప్రియాంబుల్, అంటే ఒక పొడవైన వాక్యం అయిన పీఠికలోనే ఉన్నాయి. మంచి పౌరులు కావాలంటే మనం ఈ ప్రియాంబుల్‌ని అర్థం చేసుకుని, దాని స్ఫూర్తిని అనుసరించాలి అన్నమాట.

2010 గణతంత్ర దినోత్సవం

లీలా సేథ్

ఈ పుస్తకంలోని బొమ్మలను స్మితుకి, మావోకి, అమిత్‌కి అంకితం చేస్తున్నా.

బిందియా థాపర్

ఎన్నో ఏళ్ల క్రితం, అప్పటికి మీ అమ్మమ్మ, తాతయ్య కూడా పుట్టి ఉండరేమో. అప్పుడు మన భారతదేశం ఇప్పుడు మనం నివసించే దేశం కంటే చాలా వేరుగా ఉండేది. మన దేశ ప్రజలు ఎవరితో కావాలంటే వారితో మాట్లాడలేకపోయేవారు. ఎక్కడ కావాలంటే అక్కడ పనిచేసే స్వేచ్ఛ ఉండేది కాదు. మన దేశం ఏ నియమాలు, నిబంధనల ప్రకారం నడవాలో నిర్ణయించే అధికారం కూడా ఉండేది కాదు.

ఇవన్నీ కూడా ఎక్కడో దూరం నుంచి వచ్చిన బ్రిటిష్ వాళ్లు నిర్ణయించేవారు. వ్యాపారులుగా మన దేశానికి వచ్చిన వారు **200** ఏళ్లపాటు మనకు పాలకులుగా ఉండిపోయారు.

బ్రిటిష్ వాళ్లు తమ ఆలోచనలను, చదువుకునే పద్ధతిని, పని చేసే విధానాన్ని మార్చివేయడం భారతీయుల్లో ఎంతో మందికి నచ్చేది కాదు. తమని కొన్ని రకాల ఉద్యోగాలు చేయనివ్వకపోవడం, కొన్నిచోట్లకు వెళ్లనివ్వకపోవడం కూడా వారికి ఎంతో బాధ కలిగించేది. అప్పుడు, కొంతమంది భారతీయులు ఏకమై, బ్రిటిష్ వాళ్లని ఎలా పంపించి వేయాలా అని ఆలోచించారు. ముందు వాళ్లు తుపాకులు, ఇతర ఆయుధాలతో బ్రిటిష్ వాళ్లతో పోట్లాడారు. కొంతమంది ఈ యుద్ధంలో గాయపడ్డారు. కొంతమంది చనిపోయారు. కానీ, ఏమీ మారలేదు.



1869లో మోహన్ దాస్ కరమ్‌చంద్ గాంధీ గుజరాత్‌లో జన్మించారు. మనకు ఆయన మహాత్మా గాంధీగా, బాపూగా తెలుసు. దాదాపు ఇరవై ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఆయనకు సత్యం పలకడం, శాంతంగా, ధైర్యంగా ఉండడం మార్పు తీసుకువచ్చేందుకు ఉత్తమ మార్గాలని అర్థమైంది. భారత దేశాన్ని స్వతంత్ర దేశంగా చేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలకు ఆయన నాయకుడు అయ్యాడు. కొట్లాట ద్వారా కాక, భారత్‌ను అహింస ద్వారా మాత్రమే స్వతంత్ర దేశం చేయగలమని ఆయన చెప్పారు. మనం స్వయం శక్తి సంపాదించుకోవాలని ఆయన చెప్పారు. మనకి మనం ఆలోచించుకోవాలని, బ్రిటిష్ వారి ఆదేశాలు తప్పు అని మనం అనుకుంటే వాటిని అనుసరించ రాదని ఆయన చెప్పారు.

బొంబాయి (ముంబయి) సముద్రం ఒడ్డున నడుస్తున్న బాపూ.





జవహర్‌లాల్ నెహ్రూ **1947** ఆగస్ట్ **14** వతేదీ అర్ధరాత్రి సమయాన ప్రసంగిస్తుండగా తీసిన చిత్రం. ఆయన తన ఉపన్యాసంలో 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' అనేటటువంటి అనేక గొప్పగొప్ప పదాలను వాడారు. 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' అంటే విధితో భేటీ అన్నమాట.

ఎన్నో ఏళ్ళు పోరాటం జరిపిన తర్వాత **1947** ఆగస్టు **15**వ తేదీన భారత్ స్వతంత్ర దేశం అయింది. అప్పటి నుంచి మన పౌరులు (అంటే ఒక దేశానికి చెందినవారు) ప్రభుత్వాన్ని ఎలా ఎన్నుకోవాలి? అది ఎలా పని చేయాలి – మనం, మన జీవితాలు, ఇతరుల జీవితాలు మెరుగయ్యేలా ఎలా ప్రయత్నించవచ్చో నిర్ణయించే స్వతంత్ర దేశంగా మారాం.

మనం స్వతంత్ర దేశమయ్యాక, కొన్ని విషయాలను గుర్తించాలని నిర్ణయించాంః

మన జాతీయ గీతం – జన గణ మన

మన జాతీయ జెండా – త్రివర్ణ పతాకం

మన జాతీయ చిహ్నం

మన జాతీయ జంతువు

మన జాతీయ పక్షి

మన జాతీయ పుష్పం

మనం మన దేశం పనిచేస్తూ ఉండేలా చూసేందుకు అన్ని నియమాలు, ఆలోచనలతో భారత రాజ్యాంగం అనే పుస్తకం కూడా రాసుకున్నాం. మన దేశంలో ఇది అతి ముఖ్యమైన పుస్తకం. అది ప్రియాంబుల్ అనే ఉపోద్ఘాతంతో ప్రారంభమవుతుంది. ఈ ఉపోద్ఘాతం రాజ్యాంగానికి ఆత్మ. న్యాయం (న్యాయం అంటే నిష్పాక్షికంగా ఉండడం), సమానత్వం అనే వాటిని మన జాతీయ లక్ష్యాలుగా ఇది నిర్దేశిస్తుంది.

పీఠికలో ఏం చెప్పారు? దాని అర్థం ఏమిటి? దానిని ఎందుకు రాశారు?
ఎవరు రాశారు? అనే విషయాలు మీకు చెబుతాను.

THE CONSTITUTION OF INDIA

Preamble

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity;

and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

భారత రాజ్యాంగం శాసన వ్యవస్థ యొక్క పీఠిక (ప్రీయాంబుల్)

ప్రియాంబుల్‌లో 1977లో మార్పులు చేసి, సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) అన్న పదాలను, ఇంటిగ్రిటీ (సమగ్రత) అనే పదాన్ని చేర్చారు.

ఇప్పుడు ఉపోద్ఘాత ప్రకటన ఇలా ఉంటుందిః

ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులు (మౌలిక హక్కులు) మన రాజ్యాంగంలో ముందు నుంచీ భాగమే. అయితే, మౌలిక విధులు, కర్తవ్యాలు అనే అంశాన్ని 1977 ప్రారంభంలో చేర్చారు. మన దేశాన్ని కాపాడడం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం, అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులను సంరక్షించడం, ఉత్తమ ప్రమాణాల కోసం కృషి చేయడం ఇందులో భాగం.

మనం, ఈ భారత దేశ ప్రజలం, భారత్‌ను సార్వభౌమ,
సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్రంగా
ఏర్పాటు చేసేందుకు, దేశ పౌరులందరికీ:

న్యాయం, సామాజిక, ఆర్థిక, రాజకీయ;

స్వేచ్ఛ, ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, నమ్మకం ప్రార్థనలో;

సమానత్వం, హోదాలో, అవకాశాల్లో కల్పిస్తామని; అందరి మధ్య

సౌభ్రాతృత్వాన్ని పెంపొందించి, వ్యక్తి గౌరవాన్ని, దేశ
సమైక్యతను, సమగ్రతను పెంపొందిస్తామని,

మన రాజ్యాంగ పరిషత్ సభలో, 1949 నవంబర్ 26వ
దినాన, ఈ రాజ్యాంగాన్ని ఆమోదించి, అమలు చేసి,
మాకు మేము ఇచ్చుకుంటున్నాము.

Eighth Schedule

[Articles 344 (1) and 351]

Language

1. Assamese.
2. Bengali.
3. Gujarati.
4. Hindi.
5. Kannada.
6. Kashmiri.
7. Malayalam.
8. Marathi.
9. Oriya.
10. Punjabi.
11. Sanskrit.
12. Tamil.
13. Telugu.
14. Urdu.

Jawaharlal Nehru — B. Pattabhi Sitaramayya

K. Kamaraja Nadar — G. P. Ramireddy

Hrudai Krishna Kunzru — Amrit Swaminadhan

G. Durgabai — M. Thirumalai Rao

డా. రాజేంద్ర ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ మరియు ఇతరులచే సంతకం చేయబడిన రాజ్యాంగంలో ఒక పేజీ.

1950లో మన తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, మన తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, ఇంకా అనేక మంది రాజ్యాంగంపై సంతకాలు చేశారు.

జవహర్ లాల్ నెహ్రూ సంతకం చేసిన మొట్టమొదటి వ్యక్తి. ఆయన అప్పుడు ఎంత ఉద్వేగంతో, ఉత్సాహంతో ఉన్నారంటే రాష్ట్రపతి సంతకానికి చోటు విడిచిపెట్టడమే మరిచిపోయారు. ఆ తర్వాత రాష్ట్రపతి ఆయన సంతకంపైన ఒక చిన్న చోటులో దూర్చి తన సంతకం పెట్టారట.

రాజ్యాంగంపై సంతకం చేస్తూన్న జవహర్‌లాల్ నెహ్రూ.

సరే, అయితే రాజ్యాంగం అంటే ఏమిటి?

ఒక దేశ ప్రజలు అంగీకరించిన ఆలోచనలు, నియమాలు, వాగ్దానాలు, విధులతో కూడిన ఒక పుస్తకం రాజ్యాంగం. పౌరులు అవసరం అనుకుంటే ఎప్పటికప్పుడు అందులో మార్పులు చేయవచ్చు. కానీ, ఇది దేశంలోనే అతి ముఖ్యమైన చట్టం కనక, మార్పులు చేయడం మరీ అంత తేలిక కాదు.

భారత్ రాజ్యాంగాన్ని లిఖించింది.

బ్రిటన్ వంటి కొన్ని దేశాలకు లిఖితపూర్వక రాజ్యాంగం లేదు.

1947లో బ్రిటిష్ పాలన నుంచి భారత్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, మనకు ఎలాంటి జీవితం కావాలి మనకు ఎలాంటి హక్కులు, విధులు, కర్తవ్యాలు ఉండాలి అనేది మనం నిర్ణయించుకున్నాం. మనకు ఎటువంటి పాలన కావాలో కూడా మనం నిర్ణయించాం. మన ఆలోచనలన్నీ కలిపి మన రాజ్యాంగంగా సమకూర్చాం. అది ప్రియాంబుల్‌తో మొదలవుతుంది.

ఈ ఉపోద్ఘాతంలో పెద్ద పెద్ద పదాలు ముందు కొత్తగా అనిపిస్తాయి. కానీ వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం బాగుంటుంది.



ఇక ఇప్పుడు పీఠికను చూద్దామా? చిన్న చిన్న పదాల్లో దానిని వివరించడానికి నేను ప్రయత్నిస్తాను.

మేము ఈ భారత దేశ ప్రజలం – అంటే, పిల్లలతో సహా మన దేశంలోని ప్రజలు అందరూ అన్నమాట.

మన దేశంలో ఎన్నో భాషలు ఎటువంటి లిపి లేకుండా మాట్లాడేవి మాత్రం ఉన్నాయి.



మన దేశంలో 15 సంవత్సరాలలోపు పిల్లలు 40 కోట్ల మంది ఉన్నారు.

మన దేశంలో దాదాపు 120 కోట్ల మంది ఉన్నారు. మనం 22 అధికార భాషలు సహా అనేక భాషలు మాట్లాడతాం.



మనం ఏడాదిలో 100కిపైగా
పండుగలు జరుపుకుంటాం.

భారత్‌ను రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసేందుకు నిశ్చయించి...



సార్వభౌమ: మేము, ఈ దేశ పౌరులం మాత్రమే, మేము ఏం చేయాలో, చేయవద్దో నిర్ణయించుకుంటాం. ఇంకా ఏ ఇతర దేశం కూడా మాకు ఏం చేయాలో చెప్పలేదు.

మనం ఏ చేయాలో చెప్పే హక్కు ఏ దేశానికీ లేకపోయినప్పటికీ, మనం వ్యాపారం కోసం, శాంతి రక్షణ కోసం, వాతావరణంలో మార్పుల వంటి కొన్ని సమస్యల పరిష్కారం కోసం, ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకోవలసి ఉంటుంది.

సామ్యవాద: అంటే, ఒక దేశంలోని ప్రజలు దేశ సంపదను ఉత్పత్తి చేయాలని, పంచుకోవాలని అర్థం. ఉపోద్ఘాత ప్రకటనకు ఈ పదాన్ని చేర్చినప్పుడు, మన దేశ ప్రధాన మంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ, సామ్యవాదం అంటే 'భారత దేశ ప్రజల జీవితాలను మెరుగు పరచడమని అర్థం' అని చెప్పారు.

అంటే, మనకు ఉన్న వాటిని
మనం పంచుకోవాలి

ప్రతి ఒక్కరూ
స్కూలుకి వెళ్లగలగాలి

అందరికీ సరిపోయేంత
ఆహారం ఉండాలి

ప్రతి ఒక్కరికీ సురక్షితమైన
ఇల్లు ఉండాలి

ప్రతి ఒక్కరూ
ఆరోగ్యవంతమైన
జీవితం గడిపి,
అవసరమైనప్పుడు
డాక్టర్ దగ్గరకు వెళ్ల
గలిగి ఉండాలి.



లౌకిక: మన దేశంలో లౌకికం అంటే, ప్రభుత్వం ఒక మతం కంటే మరో మతం పట్ల ఎక్కువ అభిమానం చూపకూడదు అని అర్థం. అంటే, అన్ని మతాలను విశ్వాసాలను సమానంగా గౌరవించాలని, మనకి ఇష్టమైన మతం లేదా విశ్వాసాన్ని మనం అనుసరించే స్వేచ్ఛ ఉండాలని అర్థం. మతాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒక విషయంగా బోధించరాదు. ప్రభుత్వం అధికార మతంగా దేనినీ ప్రకటించరాదు.

దేవుడున్నాడో లేడో
తెలియదను వాదం

నాస్తికత బుద్ధివాదం

మానవతా వాదం

జీవ వాదం

దేశంలో దాదాపు 80 శాతం మంది
హిందూ మతాన్ని పాటిస్తారు.

క్రైస్తవ మతం దాదాపు
2000 ఏళ్ల కిందట భారత దేశానికి వచ్చింది.

ఇస్లాం మన దేశంలో 1000 ఏళ్లకుపైగా
అనుసరించిన మరో మతం.

సిక్కు మతం, జైన మతం, బౌద్ధ మతం వంటివి
భారత దేశంలోనే జన్మించాయి. బౌద్ధ మతం మన దేశం
నుంచే ఇతర దేశాలకు వ్యాపించింది.

ప్రజాస్వామిక గణతంత్రం: అంటే ఒక రాజు గానీ రాణి గానీ లేకుండా ప్రజలే నడిపే ప్రభుత్వం. ప్రజల మంచి కోసం ప్రజలే ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు.





మన చట్టాలు ఎవరు చేస్తారు. మన ప్రభుత్వాన్ని ఎవరు నడిపిస్తారు?

మన చట్టాలు చేసేందుకు మనం ఎంపిక చేసుకున్న కొంతమంది వ్యక్తుల సమూహమే పార్లమెంటు. మన దేశంలో పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి ఉంటారు. లోక్‌సభకు మనం **543** మంది స్త్రీలను, పురుషులను ఎన్నుకుంటాం. ఇద్దరు సభ్యులను ఎన్నిక లేకుండా ఎంపిక చేస్తారు. రాజ్యసభకు మనం **233** మందిని ఎన్నుకుంటాం. (అయితే ఇది వేరే పద్ధతిలో జరుగుతుంది.) **12** మంది సభ్యులు ఎన్నిక లేకుండా ఎంపిక అవుతారు. దీంతో, మొత్తం **790** మంది పార్లమెంటు సభ్యులు ఉంటారు. రాష్ట్రపతి ఎన్నిక మాత్రం చాలా క్లిష్టమైన పద్ధతిలో జరుగుతుంది.

పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయుడు, భారతీయురాలు మన దేశాన్ని ఎవరు పాలించాలి? మన చట్టాలను ఎవరు చేయాలి? అని ఎంపిక చేసుకునేందుకు ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. మీరు ఆడా, మగా, మీ సంపద, విద్య, కులం, మతం ఏమిటి? అనే దానితో దీనికి సంబంధం లేదు.

ఓటు వేయడం అంటే ఒక వ్యక్తి, వస్తువు లేదా ఒక ఆలోచనను ఎంపిక చేసుకోవడం. ఈ ఓటింగ్ బహిరంగంగా లేదా రహస్యంగా జరగవచ్చు. చేతులు ఎత్తి మీ జట్టు కెప్టెన్‌ని ఎంపిక చేసుకుంటే, అది బహిరంగ ఓటింగ్. కానీ, మనం మన చట్టాలను చేసే వారిని ఎన్నుకున్నప్పుడు అది రహస్య ఓటింగ్. అంటే, ఎవరన్నా భయం లేకుండా, ఎవరినీ బాధ పెట్టకుండా ఓటు వేయవచ్చు అన్నమాట.

మన దేశం మీద ప్రభావం చూపే విషయాల గురించి పార్లమెంటు సభ్యులు, కొత్త చట్టాలు చేసి కష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారు. వారు సూచించిన ఒక చట్టానికి లోక్‌సభ, రాజ్యసభ కూడా ఆమోదించిన తర్వాత, రాష్ట్రపతి దాని మీద సంతకం పెట్టడం చివరి మెట్టు.

లోక్‌సభలో అతి పెద్ద ఎంపీల కూటమి నాయకుడు సాధారణంగా భారత ప్రధాన మంత్రి అవుతారు. ప్రధాన మంత్రి అంటే మన దేశానికి అధినేత. మిగిలిన మంత్రులను ఆయన లేదా ఆమె ఎంపిక చేస్తారు.

మన దేశం ఉత్తరప్రదేశ్, గుజరాత్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాలుగా విభజించబడింది. రాష్ట్రాల్లో కూడా, చట్టాలను రూపొందించేందుకు ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటారు. రాష్ట్రంలో ప్రభుత్వాధినేతను ముఖ్యమంత్రి అంటారు. ఆయన లేదా ఆమె ఆ రాష్ట్రానికి మంత్రులను ఎన్నుకుంటారు.

సివిల్ సర్వెంట్స్ అంటే ఉన్నతాధికారుల సహాయంతో మంత్రులు ప్రభుత్వాన్ని నడిపిస్తారు. కొన్ని పనులను భారత ప్రభుత్వం చేస్తుంది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తాయి. కొన్ని పనులు రెండూ కలిసి చేస్తాయి. దేశం లోపల శాంతిని కాపాడేందుకు పోలీసులు సహాయపడతారు. వెలుపల శాంతికి సైన్యం, నౌకాదళం, వాయుసేన – ఈ మూడు సాయుధ దళాలు పని చేస్తాయి.

...తన పౌరులందరికీ

న్యాయం: సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం లభించేలా చూడడం. అంటే, అన్ని విషయాల్లో ప్రజలందరి పట్ల నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించాలి. ఇందులో 1) మన చుట్టూ ఉన్నవారు మన పట్ల సరిగ్గా ప్రవర్తిస్తున్నారా లేదా 2) మన జీవనోపాధి మనం గడించుకోవడానికి మనకు సమానావకాశం లభించిందా లేదా 3) మనం స్వేచ్ఛగా ఓటు వేయగలమా మనకి ఓటు స్వేచ్ఛగా వేస్తారా అన్న విభాగాలు.

స్వేచ్ఛ: ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, నమ్మకం ప్రార్థనలో;

అంటే, మనకు ఇష్టం వచ్చిన పనులు చేయడం. మన ఆలోచనల గురించి స్వేచ్ఛగా మాట్లాడడం, రాయగలగడం, ఇష్టం ఉన్నచోట జీవించడం, మన స్నేహితులను ఎంచుకోగలగడం, మనకి నచ్చిన మతాన్ని నమ్మి అనుసరించడం, ప్రయాణించేందుకు, బృందాలు, సంస్థలు ఏర్పాటు చేసుకునేందుకు స్వేచ్ఛ కలిగి ఉండడం;

ఈ పనుల వల్ల, నమ్మకాల వల్ల ఇతరులకు హాని లేనంత వరకు ఈ స్వేచ్ఛ కలిగి ఉండడం.

కలలు కనే హక్కు

భయం లేకుండా జీవించే హక్కు

సంతోషంగా ఉండే హక్కు

ఎంపిక చేసుకునే హక్కు

స్వయం భావ ప్రకటనకు స్వేచ్ఛ

సమానత్వం: హోదాలో, అవకాశంలో సమానత్వం అంటే మతం, జన్మస్థలం, జాతి, కులం ఏదయినప్పటికీ, స్త్రీలైనా, పురుషులైనా, ధనికులైనా, పేదలైనా అందరినీ ఒకేలా చూడాలి. తమ జీవితాలు మెరుగు పరచుకునేందుకు అందరికీ అవకాశం ఇవ్వాలి.



అందరి మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించి, వ్యక్తి గౌరవాన్ని, దేశ సమైక్యతను పెంపొందిస్తాం. అంటే భారతీయులందరూ తమ భాష, మతం, సంస్కృతి వేరైనా ఒకే కుటుంబంలా ఉండాలని, ఒకరినొకరు సోదర భావంతో చూసుకునేలా ప్రోత్సహించాలని అర్థం. భారత్‌ను పటిష్ఠమైన దేశంగా మలచేందుకు ఈ భిన్నత్వంలో ఏకత్వం అవసరం.

మన రాజ్యాంగ పరిషత్తు సభలో, 1949 నవంబర్ 26వ దినాన, ఈ రాజ్యాంగాన్ని ఆమోదించి, అమలు చేసి, మాకు మేము ప్రసాదించుకుంటున్నాము.

ప్రభుత్వం బాగా పనిచేసేలా ఎవరు చూస్తారు? కోర్టులు, మీడియా, మనమందరం.

ప్రజలందరినీ న్యాయంగా, సమానంగా చూసేలా, చట్టాలు అనుసరించేలా చూడడం బాధ్యత సుప్రీం కోర్టు, వివిధ రాష్ట్రాల్లో హైకోర్టులు, దిగువ కోర్టులది. కోర్టుల్లో వ్యవహారాలు నిర్ణయించేవారు జడ్జిలు. నిజాయితీగా, న్యాయంగా, నిష్పక్షపాతంగా ఉండడం వారి బాధ్యత.

మనం మీడియా అని పిలిచే టీవీ, రేడియో, ఇంటర్నెట్, వార్తా పత్రికలు, పత్రికలూ మనకి దేశంలో ఏం జరుగుతోందో, ప్రభుత్వం ఏం చేస్తోందో, కొన్నిసార్లు పరిస్థితులను ఎలా చక్కదిద్దాలో చెబుతాయి.

మనం కూడా చదవడం ద్వారా, రాయడం ద్వారా, చర్చించడం ద్వారా, బయట మాట్లాడడం ద్వారా ప్రజాభిప్రాయం ఏర్పడేలా చేసి, సరైన పని చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు. పైగా, ఎన్నికలప్పుడు, మన ఎంపీలు (అంటే మనం ఓటు వేసి ఎన్నుకున్నవారు) ఇంత కాలం నిజాయతీగా లేరని, కష్టపడి పని చేయలేదని అనిపిస్తే వేరే వారికి ఓటు వేయవచ్చు.

మన ప్రియాంబుల్‌ను పరిశీలించాం కదా! ఇప్పుడు మన రాజ్యాంగాన్ని ఎలా రాశారో తెలుసుకుందాం.

1946 డిసెంబర్ 9వ తేదీన మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎనిమిది నెలల ముందు, కొంతమంది పురుషులు, మహిళలు న్యూఢిల్లీలో మనం సెంట్రల్ హాల్ ఆఫ్ పార్లమెంట్ హౌస్ అని పిలిచే సుందరంగా అలంకరించిన హాల్‌లో సమావేశమయ్యారు. తమ ఆలోచనల గురించి చర్చించి, రాజ్యాంగం రాసేందుకు వారు సమావేశమయ్యారు.

రాజ్యాంగం రాసేందుకు వారు సమావేశం జరిపారు కనుక వారిని రాజ్యాంగ పరిషత్ అని పిలిచారు. వారు అనేకసార్లు సమావేశం జరిపి, రాజ్యాంగం కోసం ఎన్నో ఆలోచనలను చెప్పారు. అయితే, రాజ్యాంగాన్ని రాయడం, రూపొందించడం అనేది ప్రత్యేకమైన పని. అందువల్ల, ఆ పని చేసేందుకు వారు తమలోనే కొంతమందిని ఎంపిక చేసుకున్నారు. ఆ డ్రాఫ్టింగ్ అంటే రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్. రాజ్యాంగం గురించి చర్చించేందుకు ఈ కమిటీకి రెండేళ్ల పదకొండు నెలల పదిహేడు రోజులు పట్టింది.

రాజ్యాంగం అసలు రూపంలో ప్రతులు మూడు ఉన్నాయి. ఒకటి ఇంగ్లిష్‌లో చేతి రాతలో ఉండి, శాంతి నికేతన్‌కు చెందిన నందలాల్ బోస్ నేతృత్వంలో అనేకమంది గొప్ప గొప్ప కళాకారులు వేసిన బొమ్మలతో ఉంది. రెండోది కూడా ఇంగ్లిష్‌లోనే కానీ, ముద్రించిన ప్రతి. మూడోది హిందీలో చేతి రాతలో ఉండి, వివిధ కళాకారుల బొమ్మలతో ఉంది. న్యూఢిల్లీలోని పార్లమెంటు లైబ్రరీలో సమంగా ఉష్ణోగ్రత ఉండే చోట, తాళం వేసిన గాజు పెట్టెలో వీటిని ఉంచారు. మరో కొన్ని కాపీలు ఇతర చోట్ల కనిపిస్తాయి. ఉదాహరణకి, ఇండియా ఇంటర్నేషనల్ సెంట్రల్ లైబ్రరీలోను, నెహ్రూ స్మారక మ్యూజియం లైబ్రరీలోనూ ఉన్నాయి.

మన రాజ్యాంగాన్ని తీర్చి దిద్దిన వారు ఎవరు?

డాక్టర్ రాజేంద్ర ప్రసాద్



బీహార్‌లో జిరాది గ్రామంలో **1884** డిసెంబర్ **3**వ తేదీన ఆయన జన్మించారు. ఆయన మంచి తెలివైన విద్యార్థి. న్యాయ శాస్త్రంలో బంగారు పతకం కూడా గెలుచుకున్నారు. గాంధీజీ వల్ల ప్రభావితమై, ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. రాజ్యాంగ పరిషత్ సభకు ఆయన అధ్యక్షుడు. భారత తొలి రాష్ట్రపతిగా ఉన్న రాజేంద్రప్రసాద్, రెండుసార్లు ఆ పదవిని చేపట్టారు. ఆయన **1963** ఫిబ్రవరి **28**న మరణించారు.

ప్రతి రాష్ట్రపతిని మనం ఐదేళ్ల పదవీ కాలానికి ఎన్నుకుంటాం. అయితే, రెండుసార్లు ఎన్నికైంది రాజేంద్ర ప్రసాద్ మాత్రమే. మనకి హిందూ, ముస్లిం, సిక్కు వ్యక్తులు రాష్ట్రపతులుగా ఉన్నారు. **2007**లో తొలిసారిగా ఓ మహిళ మన దేశానికి రాష్ట్రపతి అయ్యారు.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ

జవహర్ లాల్ నెహ్రూ **1889** నవంబర్ **14**వ తేదీన ప్రస్తుత ఉత్తర ప్రదేశ్ అప్పటి యునైటెడ్ ప్రొవిన్స్‌లోని అలహాబాద్‌లో జన్మించారు. ఇంగ్లాండ్‌లో పాఠశాల, కళాశాల విద్య పూర్తి చేసుకున్న ఆయన న్యాయవాదిగా పని చేశారు. స్వదేశానికి తిరిగి వచ్చాక ఆయన గాంధీజీతో కలిసి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. **1947**లో భారత్ స్వతంత్ర దేశం కాగానే మొదటి ప్రధాన మంత్రిగా ఆయనను ఎన్నుకున్నారు. **1964** మే **27**వ తేదీన మరణించే వరకు ఆయనే ప్రధాన మంత్రిగా ఉన్నారు. మన దేశాన్ని మెరుగైన ప్రదేశంగా చేసేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. ఆధునిక భారత దేశం వాస్తుశిల్పిగా ఆయనను వర్ణిస్తుంటారు. పిల్లలంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఆయనను ప్రేమతో చాచా నెహ్రూ అని పిలిచేవారు. ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటారు.



ఢిల్లీ సమీపంలో వడగళ్ల వాన పల్ల ఇబ్బంది పడిన రైతుల పిల్లలతో జవహర్‌లాల్ నెహ్రూ

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తె ఇందిరా గాంధీ. ఆ తర్వాత ఆయన మనవడు రాజీవ్ గాంధీ కూడా మన దేశానికి ప్రధాన మంత్రులు అయ్యారు.

డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్

ప్రస్తుత మధ్యప్రదేశ్‌లో మౌలో **1891** ఏప్రిల్ **14**న ఆయన జన్మించారు. ఆయన తండ్రి బ్రిటిష్ సైన్యంలో పని చేసేవారు. అంబేద్కర్ అనేక ఆటంకాలను అధిగమించి చదువుకున్నారు. అంటరానివారని భావించే ఒక కులానికి చెందినవారు కావడంతో అంబేద్కర్‌నూ మరికొంతమంది పిల్లలను తరగతి గది బయట కూర్చోబెట్టేవారు. టీచర్ వారిని చూడడం, సహాయపడడం చేసే వారు కాదు. పిల్లలకి మంచినీళ్ల కోసం పెట్టిన జగ్‌ని వారిని ముట్టుకోనిచ్చేవారు కాదు.

అంబేద్కర్ మొదట బొంబాయికి, తర్వాత ఇంగ్లండ్‌కి, అమెరికాకి వెళ్లి విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. భారత్‌కు తిరిగి వచ్చాక ఆయన న్యాయవాద వృత్తి చేపట్టారు. అంటరానివారని భావించే వారి కష్టాలు ఏమిటో ఆయనకు తెలుసు కనక దానికి కారణమైన కుల వ్యవస్థపై ఆయన పోరాటం జరిపారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్

గుజరాత్‌లోని నాదియాడ్‌లో **1875** అక్టోబర్ **31**న ఆయన జన్మించారు. చిన్న పిల్లవాడిగా ఆయన తన తండ్రితో కలిసి పొలాల్లో పని చేశారు. సొంతంగా చదువుకునేందుకు ఎంతో కష్టపడి, పని చేసి పటేల్ న్యాయవాది అయ్యారు. గాంధీజీ వల్ల స్ఫూర్తి పొందిన పటేల్, గుజరాత్‌లో రైతుల చేత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసా ఉద్యమాలు చేయించారు. భారత తొలి ఉప ప్రధాన మంత్రి ఆయన. దేశంలో అయిదు వందలకుపైగా సంస్థానాలు భారతదేశంలో విలీనం అయ్యేలా ఆయన ఒప్పించారు. పటిష్ఠమైన ఆయన నాయకత్వం కారణంగా సర్దార్ పటేల్ ఉక్కు మనిషి అని పేరు పొందారు. ఆయన **1950** డిసెంబర్ **15**నాడు తుదిశ్వాస విడిచారు.

మౌలానా అబుల్ కలాం ముహియుద్దీన్ అహ్మద్



మౌలానా ఆజాద్‌గా ప్రసిద్ధి చెందిన మౌలానా అబుల్ కలాం సౌదీ అరేబియాలో **1888** నవంబర్ **11**న పుట్టారు. ఆయన తండ్రి చాలాపెద్ద ముస్లిం పండితుడు. మౌలానా ఆజాద్ విలేకరి. ఆయన ఒక ఉర్దూ వార్తా పత్రిక నడిపేవారు. ఆయన కలం పేరు 'ఆజాద్'. అంటే స్వేచ్ఛాయుతమని అర్థం. హిందూ - ముస్లిం మైత్రి ఉండాలని ఆయన గట్టిగా విశ్వసించి, ప్రవచించేవారు. ఒక హిందూ సగర్వంగా తాను భారతీయుడిని అని చెప్పుకొన్నట్లే ఒక ముస్లిం, ఒక క్రైస్తవుడు కూడా అలాగే చెప్పుకోవచ్చునని ఆయన అనేవారు. భారత తొలి విద్యా మంత్రి అయిన మౌలానా ఆజాద్ **1958** ఫిబ్రవరి **22**నాడు దివంగతులు అయ్యారు.

మన దేశంలో సైనిక దళాల్లో కాక ఇతర రంగాల్లో ఉండే వ్యక్తులకు ఇచ్చే అత్యున్నత పురస్కారం భారతరత్న. రావి ఆకు రూపంలో ఈ పురస్కారం ఉంటుంది. **2008** వరకు నలభై ఒక్క భారత రత్నలు ఇవ్వగా, వాటిలో కేవలం ఐదు మాత్రమే మహిళలకు ఇచ్చారు. ఇక్కడ మనం తలచుకున్న ఆరుగురు వ్యక్తులకు భారత రత్న ఇచ్చారు. వారిలో కొంతమందికి మరణానంతరం ఈ పురస్కారాన్ని ప్రకటించారు.

రాజకుమారి అమ్మృత్‌కౌర్

ప్రస్తుత ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆమె **1889** ఫిబ్రవరి **2**వ తేదీన జన్మించారు. ఆమె క్రైస్తవ మతానికి చెందినవారు. ఇంగ్లండ్‌లో స్కూలు, కాలేజీ విద్య పూర్తి చేసుకుని భారత్‌కు తిరిగి వచ్చిన అమ్మృత్‌కౌర్, గాంధీజీ చేత చాలా ప్రభావితమై, ఆయనతో కలిసి ఎన్నో ఏళ్లు పని చేశారు. స్వతంత్ర భారత దేశంలో తొలి మహిళా మంత్రిగా ఆమె ఆరోగ్య మంత్రిగా ఆమె పదవి నిర్వహించారు. బాల్య వివాహం, పరదా (అంటే, ఒక స్త్రీ తన ముఖాన్నికప్పుకునేలా చేయడం, ఇంటి బయటకు ఎక్కువగా వెళ్లకుండా నిరోధించడం) వంటి ఆచారాలకు వ్యతిరేకంగా ఆమె పని చేశారు. అబ్బాయిలను, అమ్మాయిలను ఒకే విధంగా చూడాలని, పిల్లలందరూ స్కూలుకి వెళ్లేలా చూడాలని ఆమె అనేవారు. **1964** అక్టోబర్ **2**న ఆమె మరణించారు.

చక్రవర్తి రాజగోపాలాచారి



తమిళనాడులోని సేలం జిల్లాలో తోరపల్లి అనే గ్రామంలో **1878** డిసెంబర్ **10**న జన్మించారు. సీఆర్ లేదా రాజాజీ అని పిలవబడే రాజగోపాలాచారి, ముందు ఒక చిన్న పట్టణంలోనూ, ఆ తర్వాత మద్రాసు (ఇప్పుడు చెన్నై) ప్రెసిడెన్సీ కళాశాలలోనూ చదువుకున్నారు. స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్న రాజాజీ దళితుల పరిస్థితి మెరుగుపరచడానికి ఎంతగానో కృషి చేశారు. మన దేశంలో ఏకైక గవర్నర్ జనరల్‌గా ఆయన రాష్ట్రపతి భవన్ అనే అతి పెద్ద అద్భుతమైన భవంతిలో నివసించినప్పటికీ తన బట్టలు తానే ఉతుక్కుంటూ తన జోళ్లు తానే పాలిష్ చేసుకుంటూ ఎంతో సాదాసీదాగా జీవితం గడిపారు. ప్రపంచ శాంతి ఉండాలని ఆయన గట్టిగా నమ్మేవారు. తొంభై నాలుగేళ్ల వయసులో **1972** డిసెంబర్ **25**న ఆయన పరమపదించారు.

1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ పరిషత్ సభ రాజ్యాంగాన్ని ఆమోదించింది. (ఈ రోజును ఇప్పుడు న్యాయ దినోత్సవంగా పాటిస్తున్నారు.) 1950 జనవరి 24వ తేదీన రాజ్యాంగ పరిషత్ సభలో 284 మంది సభ్యులు సంతకాలు చేశారు.



రెండు రోజుల తర్వాత జనవరి **26**న (గణతంత్ర దినోత్సవంగా ఈ రోజుకు పేరు) మనం భారత రాజ్యాంగాన్ని చట్టాల పరిధిలోకి తెచ్చాం. బ్రిటిష్ వారి నుంచి 'సంపూర్ణ స్వరాజ్యం' కావాలని జవహర్ లాల్ నెహ్రూ డిమాండ్ చేసిన ఇరవై ఏళ్ల తర్వాత సరిగ్గా ఈ రోజునే ఇది జరిగింది.

గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రదర్శన శకటం. వెనుక నేపథ్యంలో పార్లమెంటు హౌస్ భవనాన్ని చూడవచ్చు.

రాజ్యాంగంలో ప్రియాంబుల్ ఏమంటోంది, దానిని ఎవరు రాశారు, అని ఇప్పుడు మనకి అర్థం అయింది కనక, ఒకసారి చదువుదాం. చిన్న చిన్న పదాల్లో కానీ పెద్ద వాక్యంలో దీనిని మరోసారి చదువుదాం. 'ప్రజలు' అనే పదం స్థానంలో నేను 'పిల్లలు' అని చేర్చాను.

మేము, భారతదేశంలో పిల్లలం, భారత్‌ను భారతీయులందరికీ మెరుగైన జీవనం ఇచ్చే; ఏ ఒక్క మతాన్ని కూడా వేరొక మతం కంటే ఎక్కువగా చూడకుండా ఉండే; అన్ని మతాలను, నమ్మకాలను గౌరవించే; అందరిపట్ల నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించేలా చూసి; మేము స్వేచ్ఛగా ఆలోచించి ఆచరించేందుకు;

మాకు నచ్చిన మతాన్ని పాటించేందుకు వీలు కల్పించేలా; మేమందరం సమానంగా ఉండి; మా జీవితాలను మెరుగుపరచుకునేలా అవకాశాలను పొందేలా; పరస్పరం ప్రేమ, గౌరవం పెంచుకుని; సమైక్యంగా కలిసి ఉండేలా; దేశం పట్ల శ్రద్ధతో ఉండేలా ప్రోత్సహించే స్వతంత్ర ప్రజాస్వామిక దేశం చేయాలన్న గట్టి నిర్ణయం తీసుకుని, ఈ రాజ్యాంగాన్ని మాకు మేము ప్రసాదించుకుంటున్నాము.

ఏం చేయాలి?

మన రాజ్యాంగం వచ్చి అరవై సంవత్సరాల కంటే ఎక్కువ అయింది. అయినప్పటికీ అందులో చేసుకున్న వాగ్దానాలను నెరవేర్చేందుకు మనం శ్రమించాలి.

భారత దేశంలో ప్రతి బిడ్డకు ఆహారం, ఆరోగ్యం, విద్య పొందే హక్కును రాజ్యాంగం ఇచ్చింది. అయితే, మన దేశంలో ఇంకా పేదగా, ఆకలితో ఉన్న పిల్లలు ఉన్నారు. కొంతమంది అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మరికొంతమందికి రాయడం, చదవడం రాదు. కొంతమంది పని చేయవలసి వస్తోంది. మన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల వంటి ఈ పిల్లలకు మెరుగైన జీవితం లభించకపోతే మనం అందరం సమానమని, స్వేచ్ఛా జీవులమని ఎలా అనగలం? మనం నిష్పక్షపాతంగా నిజాయితీగా ఉండి అందరి జీవితాలను మెరుగు పరిచే ప్రయత్నం చేయాలి.

'మీరు చూడాలి అనుకుంటున్న మార్పు మీరే కావాలి' అన్నారు గాంధీజీ ఒకసారి. మన చుట్టూ ఉన్న వాళ్లని మనం మార్చాలి అనుకుంటే, ముందు మనని మనం మార్చుకోవాలి. ఇతరులు ఎంత మంచిగా, దయగా, న్యాయంగా, నిజాయతీగా, ధైర్యంగా ఉండాలి అనుకొంటామో మనం అలా ఉండాలి.

మనం అందరం ఒకరినొకరు ప్రేమించి సహాయపడేలా చూస్తే, భారతదేశం శాంతితో నిండిన ఆనందమయమైన ప్రదేశం అవుతుంది. మనం నివసించే, మన సందర్శించే – మన గ్రామాలు, మన నగరాలు, మన అడవులు, సరస్సులు, నదులు అన్ని ప్రదేశాల పట్ల శ్రద్ధ వహించాలి. సంరక్షించాలి. అప్పుడే, మనమందరం సగర్వంగా అనగలుగుతాం – 'సారే జహాన్ సె అచ్ఛా హిందుస్థాన్ హమారా' అని.

చివరిగా...

మీకు ప్రియాంబుల్ స్ఫూర్తి గుర్తుండేలా చేసేందుకు ఇదిగో ఒక చిన్న కవిత!

అందరం సమానంగా, న్యాయంగా, స్వేచ్ఛగా ఉందాం
మన భిన్నత్వంలో పటిష్ఠంగా ఉందాం
ఆలోచనలో, ప్రార్థనలో స్వేచ్ఛ
కలల్లో, ధైర్యంలో స్వేచ్ఛ
ప్రేమలో, సంరక్షణలో స్వేచ్ఛ
అందరం, సమానంగా, న్యాయంగా, స్వేచ్ఛగా ఉందాం
మన భిన్నత్వంలో పటిష్ఠంగా ఉందాం.

అందరం, సమానంగా, న్యాయంగా, స్వేచ్ఛగా ఉందాం
ప్రేమలో, విశ్వాసంలో ఏకమవుదాం
బలహీనులకు చేయి అందించేలా బలం పుంజుకుందాం
అర్థం చేసుకుని సహాయపడేలా సడుం బిగిద్దాం
ఆనంద భూమి నిర్మించేందుకు నిశ్చయిద్దాం
అందరం, సమానంగా, న్యాయంగా, స్వేచ్ఛగా ఉందాం
ప్రేమలో, విశ్వాసంలో ఏకమవుదాం.

Read India

పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించడానికి ఒక దేశ వ్యాప్త కార్యక్రమంగా, 'రీడ్ ఇండియా' ఉద్యమంలో భాగంగా, ప్రథమ్ బుక్స్ 2004లో స్థాపించబడింది. పలు భారతీయ భాషలలో పిల్లల కోసం నాణ్యమైన పుస్తకాలను ప్రచురిస్తున్న ఒక లాభాపేక్ష లేని సంస్థ ప్రథమ్ బుక్స్. మా సంకల్పం 'ప్రతి పిల్లవాని చేతిలో పుస్తకం ఉండేలా' చూడడం మరియు అలా చెయ్యడం ద్వారా, దేశవ్యాప్తంగా పిల్లలలో చదువు యొక్క ఉల్లాసాన్ని వ్యాప్తిచెయ్యడం మా లక్ష్యం. మీరు ఏ రకంగానైనా సహాయపడాలనుకుంటే, దయచేసి మాకు info@prathambooks.org పై ఇ-మెయిల్ చెయ్యండి.

లీలా సేథ్ ఢిల్లీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి, మన దేశంలో ఒక రాష్ట్రానికి ప్రధాన న్యాయమూర్తిగా పదవిని నిర్వహించిన తొలి మహిళగా ఘనత సాధించారు. 1992లో హిమాచల్ ప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా ఆమె పదవీ విరమణ చేశారు. 15వ భారత న్యాయ సంఘం సభ్యురాలిగా ఉన్న లీలా సేథ్ పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యపై నివేదిక రూపొందించారు. మానవ హక్కుల ఉద్యమంలో చురుగ్గా పాల్గొనే ఆమె అనేక స్కూళ్లు, కళాశాలలతో కలిసి పని చేస్తున్నారు. మాంటిస్సోరీ విద్యలో ఆమెకు డిప్లమో ఉంది. 2003లో పెంగ్విన్ ప్రచురించిన ఆమె ఆత్మకథ 'ఆన్ బాలన్స్' ఎంతో ప్రశంస పొందింది.

బిందియా థాపర్ ఆర్కిటెక్ట్‌గా శిక్షణ పొందారు. చిత్రకారిణిగా వృత్తి ఎంచుకున్నారు. పిల్లల పుస్తకాలకు ఆమె చేసిన బొమ్మలు ఎంతో ప్రాచుర్యం పొందాయి.

మునుపటి న్యాయమూర్తి లీలా సేథ్, రాజ్యాంగం యొక్క పీఠికను చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యే మాటల్లో చెబుతారు. ప్రజాస్వామిక గణతంత్రం అంటే ఏమిటి? మనం మతంతో ప్రమేయం లేని లౌకిక వాదాన్ని ఎందుకు అనుసరించాము? సార్వభౌమాధికారం అంటే ఏమిటి? రాజ్యాంగాన్ని గురించి ఎంత చిన్న పిల్లలైనా తెలుసుకోవచ్చని నమ్ముతూ అందరూ అర్థం చేసుకుని ఆనందించేలా ఆమె ఈ భావనలను విడమరిచి చెబుతారు. అనేక ఛాయా చిత్రాలు, ఆసక్తికరమైన చిన్న చిన్న విషయాలు, మరియు ప్రఖ్యాత చిత్రకారిణి బిందియా థాపర్ గీసిన మనోహరమైన, స్ఫూర్తిదాయకమైన చిత్రాలతో కూడిన 'బాలలం, భారత దేశ పౌరులం' భావి భారత పౌరులందరూ తప్పకుండా చదవాల్సిన పుస్తకం.

అంచెలంచెలుగా చదువు నేర్చుకొనడం. ఇది నాల్గవ స్థాయి పుస్తకం.

PRATHAM BOOKS

పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించడానికి పలు భారతీయ భాషలలో పుస్తకాలను ప్రచురిస్తున్న ఒక లాభాపేక్ష లేని సంస్థ ప్రథమ్ బుక్స్.

www.prathambooks.org

We, the Children of India
(Telugu)
MRP: ₹ 110.00

ISBN 978-81-8479-438-0